**జీజీహెచ్‌లో రిఫరల్‌కే మొగ్గు**



2



2

**పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు**

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

## కలెక్టర్‌ను కలిసిన ఎంపీ అర్వింద్



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇలా త్రిపాఠిని ఎంపీ ధర్మపురి అర్వింద్ శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

9-1-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

## క్రీడల్లో జిల్లా పేరును ఇనుమడింపజేయాలి



**అక్షరటుడే, ఇందూరు:** క్రీడారంగంలో జిల్లా ఖ్యాతిని మరింత ఇనుమడింపజేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో శుక్రవారం టార్చ్ రిలేను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక, శారీరక ధృడత్వం ఏర్పడుతుందని తెలిపారు. ప్రధానంగా క్రమశిక్షణ, అలవడుతుందన్నారు. విద్యార్థులు దురలవాట్లకు బానిసలు కాకుండా క్రీడల వైపు ఆసక్తి చూపాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లా నుంచి నిఖత్ జరీన్, యెండల సౌందర్య, సౌమ్య, హుస్సాముద్దీన్ వంటి అనేకమంది అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు దేశానికి ప్రాతినిథ్యం వహిస్తుండడం అభినందనీయమన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది క్రీడాకారులు తమ ప్రతిభను మెరుగుపర్చుకోవాలని సూచించారు. తాను కూడా క్రీడాకారిణినేనని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కార్యక్రమంలో యువజన క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, క్రీడా సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

**రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేసింది. అయితే ఈ జాబితాలో అనేక తప్పులు దొర్లాయి. చాలా మంది ఓట్లు వేరే వార్డుల్లో చేర్చారు. దీనిపై ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారులు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. శుక్రవారం వరకు ఓటర్లు, రాజకీయ పార్టీలు అభ్యంతరాలు సమర్పించాయి. వీటిని అధికారులు సరి చేస్తున్నారు. అయితే ఈ నెల 12న తుది జాబితా విడుదల చేయాల్సి ఉంది. రెండు రోజుల్లో ఓటరు జాబితా సవరణ సాధ్యం అవుతుందా లేదా అని పుర ప్రజలు చర్చించుకుంటున్నారు.**

**–అక్షరటుడే, కామారెడ్డి**

# అభ్యంతరాలు సరి చేస్తారా?




**■ మున్సిపాలిటీలో ఓటరు జాబితాలో గందరగోళం ■ ఆందోళనలో ఓటర్లు.. బీఎల్‌వోలపై ఆగ్రహం ■ తప్పులను సరి చేయడానికి మరో రెండు రోజులు గడువు**

కామారెడ్డి పట్టణంలో గతంలో 33 వార్డులు ఉండేవి. విలీన గ్రామాలతో కలిపి వార్డుల సంఖ్య 49కి చేరింది. ఈ వార్డులలో ఓటరు జాబితా తప్పులతడకగా మారిందన్న ఆరోపణలు వచ్చాయి. ఓటరు జాబితాలో తప్పులు సరి చేయడానికి ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో వందలాది మంది అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. అయితే అభ్యంతరాలను ఏ మేరకు సవరిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితి ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ఉన్నట్టుగా తెలుస్తోంది.

### వందలాది ఓటర్ల షిఫ్టింగ్

ఉమ్మడి జిల్లాలోని పలు మున్సిపాలిటీ పరిధిలోని వార్డులలో ఓటర్లు వారికి తెలియకుండానే ఇతర వార్డులోకి షిఫ్టయ్యారు. బీఎల్‌వోల వద్ద ఓటరు జాబితా చూసుకునే క్రమంలో గతంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడంతో ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వార్డులో పోటీ చేసే అభ్యర్థులు సైతం ఓటరు జాబితాను చూసి నివ్వెరపోయారు. ఓటర్లు షిఫ్ట్ కావడం ఇటు ఓటర్లను, అటు పోటీ చేయబోయే కౌన్సిలర్ అభ్యర్థులను ఆందోళనకు గురి చేస్తోంది. ఓటరు జాబితా సవరణ కోసం అభ్యంతరాలను బీఎల్‌వోలు స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలో తమ ఓట్లు మరోవార్డులోకి మారడంపై ప్రజలు వారితో వాగ్వాదం చేస్తున్నారు. తమకేమీ తెలియదని, ఏదైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని చెప్పినా వినకుండా.. పలువురు బీఎల్‌వోలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### పెరిగిన ఓట్లు

కామారెడ్డి పట్టణంలో దాదాపు 8 వేల ఓట్లు పెరిగినట్టుగా బీజేపీ ఆరోపిస్తోంది. ఒక్కో వార్డులో వందల సంఖ్యలో ఓటర్లు పెరిగారని ఇటీవల మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టింది. దొంగ ఓట్లతో గెలవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించింది. ఒకే ఇంటిపై వందల ఓట్లు చేరడానికి కారణం ఎవరని నిలదీసింది. అయితే అధికారులు మాత్రం అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యంతరాల స్వీకరణ గడువు శుక్రవారం ముగిసింది. అధికారులు వాటిని సరి చేసి ఈ నెల 12న తుది జాబితా విడుదల చేయనున్నారు.

### మరో రెండు రోజులు గడువు

ఓటరు జాబితాలో సవరణకు ప్రభుత్వం మరో రెండు రోజులు గడువు పెంచింది. జాబితాలో తప్పులను సాధ్యమైనంత వరకు సవరిస్తున్నాం. ఏ వార్డు ఓటరును ఆ వార్డుకు మార్పులు చెయ్యడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. అర్హులైన ఓటర్లకు న్యాయం చేస్తాం. దొంగ ఓట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి అధికారులకు నివేదిస్తాం.

**–రాజేందర్‌రెడ్డి,**
**మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి**

## ముంపు ప్రాంతాల్లో అభివృద్ధికి నిధులు మంజూరు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లో అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు రూ.2.08 కోట్లు మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది. వీటిని నాగిరెడ్డిపేట మండల పరిధిలోని నిజాంసాగర్ ప్రాజెక్ట్ ముంపు ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్, ప్రవాహ మార్గంలో అడ్డంకులు తొలగించేందుకు వినియోగించనున్నారు. ఈ నిధుల విడుదలతో వర్షాకాలంలో ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల నష్టపోతున్న రైతులకు భారీ ఉపశమనం కలుగనుంది. వర్షాకాలంలో నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్స్ కారణంగా వ్యవసాయ భూములు ముంపునకు గురై పంట నష్టం వాటిల్లుతోంది. ఈ సమస్యను మొదటి నుంచి ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు నష్టం కలగకుండా జంగిల్ క్లియరెన్స్ తప్పకుండా చేస్తానని ఇచ్చిన హామీని ఆయన నెరవేర్చారు. ఈ అంశాన్ని ఎమ్మెల్యే మదన్ మోహన్ శాసనసభ సమావేశాల్లో పలుమార్లు ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని స్వయంగా కలిశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా ఎల్లారెడ్డి నియోజకవర్గం లో ముఖ్యంగా నాగిరెడ్డిపేట మండల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల పరిస్థితిని అర్థం చేసుకున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూల స్పందనతో ప్రభుత్వం ఈ జీవోను జారీ చేసింది. దీంతో నిజాంసాగర్ బ్యాక్‌వాటర్ కారణంగా ఇబ్బందులు పడుతున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తల్లిదండ్రులను గౌరవించాలి



**అక్షరటుడే, కోటగిరి :** ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవించాలని అలాగే భగవంతుడిని స్మరిస్తూ భక్తిమార్గంలో నడవాలని మల్లారం గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకుడు బాలయోగి కృష్ణ మహరాజ్ సూచించారు. భక్తులకు సనాతన ధర్మం గురించి వివరించారు. పోతంగల్ మండల కేంద్రంలోని సాయిబాబా కల్యాణ మండపంలో శుక్రవారం అయ్యప్ప స్వాముల ఇరుముడి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన సనాతన ధర్మం గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో గురుస్వాములు రాధాకృష్ణ, సూదం శంకర్, విజయ్ పటేల్ పాల్గొన్నారు.



## వెల్లుట్లపేట సర్పంచ్‌కు ఎమ్మెల్యే సన్మానం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** లింగంపేట్ మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు వెల్లుట్లపేట సర్పంచ్ కొయ్యల వినోద రాజాగౌడ్, ఉప సర్పంచ్ కరిచేవుల రాజు యాదవ్‌తో పాటు వార్డు మెంబర్లు, కార్యవర్గ సభ్యులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సమిష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏటీఎం ధ్వంసం చేసేందుకు యత్నించిన అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలో ఏటీఎంను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించి పోలీసులు రావడంతో పారిపోయిన ముఠా కేసును పోలీసులు ఛేదించారు. వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సీపీ సాయిచైతన్య కేసు వివరాలను వెల్లడించారు. డిసెంబర్ 31న రాత్రి గుర్తు ఐదుగురు వ్యక్తులతో కూడిన ముఠా పంజాబ్ నేషనల్ బ్యాంకు ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కాల్చి ధ్వంసం చేసే ప్రయత్నం చేసిన విషయం తెలిసిందే. అదే సమయంలో బ్లూకోల్ట్ విధులు నిర్వహించే పోలీసులను చూసి పారిపోయారు. ఈమేరకు న్యాలకంటి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నేరస్తుల గురించి గాలిస్తుండగా.. 8న మధ్యాహ్నం నిఖిల్ సాయి ఎక్స్‌రోడ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా.. బొలెరో వాహనంలో కర్రలు, రాళ్లు పెట్టుకొని వెళ్తున్న నేరస్తులను ఆపి విచారించగా ఈ చోరీ ఘటన బయటపడింది. హరియాణాకు చెందిన అబ్దుల్లా.. అమీర్, వాజీబ్, అబీద్, ఇక్రామ్‌లతో గ్యాంగ్ ఏర్పాటు చేసి చోరీలకు పాల్పడుతున్నారు.. ఈ సందర్భంగా హైదరాబాద్ నుండి జహీరాబాద్‌కు వస్తూ మార్గమధ్యలో టోల్‌ప్లాజాకు కొద్ది దూరంలో ఒక కారు చోరీ చేసి అక్కడికి దగ్గర్లో ఉన్న ఏటీఎంను ధ్వంస చేసే ప్రయత్నం చేయగా.. పోలీసులు రావడంతో పారిపోయారు. అక్కడి నుంచి డిచ్‌పల్లి చేరుకున్న చోరీముఠా అక్కడ భోజనంచేశారు. గతనెల 31న రాత్రి నిజామాబాద్ నగరానికి వచ్చి పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎంను తెల్లవారుజామున కొల్లకొట్టేందుకు ప్రయత్నించగా పోలీసులు రావడంతో అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం అర్గుల్ వద్ద ఏటీఎంలో చోరీ చేసేందుకు ప్రయత్నించి విఫలమై అక్కడి నుంచి పారిపోయారు. మళ్లీ నిజామాబాద్ నగరంలో ఏటీఎంలు ధ్వంసం చేసేందుకు రెక్కీ నిర్వహిస్తుండగా.. పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. వారి నుంచి వాహనం గ్యాస్ కట్టర్, సిలిండర్, కర్రలు, రాడ్లు, రాళ్లు ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే

**అక్షరటుడే, బోధన్ :** ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బోధన్ పట్టణంలోని గ్రామ చావడి వద్ద నూతనంగా నిర్మించిన బస్తీ దవాఖానాలను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కోసం ప్రభుత్వం వైద్యరంగానికి రూ. కోట్లలో ఖర్చు చేస్తుందన్నారు. ప్రజలకు సరైన వైద్యం అందినప్పుడే వారి స్థితిగతులు మారుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రాజశ్రీ, బోధన సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో సీపీ టీం విజయం

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో సీపీ టీం వర్సెస్ ప్రెస్ క్లబ్ ఎలెవన్ టీం మధ్య క్రికెట్ మ్యాచ్ ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ పోటీలో సీపీ టీం విజయం సాధించింది. టాస్ గెలిచిన పోలీస్ టీం బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 12 ఓవర్లలో జట్టు మూడు వికెట్లు కోల్పోయి 133 పరుగులు సాధించింది. నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి 25 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రెస్ క్లబ్ జట్టు 12 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 90 పరుగులు మాత్రమే చేసింది. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మూడు ఓవర్లు బౌలింగ్ వేసి ప్రతి ఓవర్‌లో మూడు వికెట్లు తీశారు. ఆయన బౌలింగ్ మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. అదనపు డీసీపీ బస్వారెడ్డి ఒక ఓవర్ వేసి ఒక వికెట్ తీశారు. ప్రెస్ క్లబ్ జట్టులో శివతాగూర్ 24 పరుగులు చేశారు. 43 పరుగుల తేడాతో పోలీస్ జట్టు ప్రెస్ క్లబ్ జట్టుపై విజయం సాధించింది. విజేతలకు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ బహుమతులు ప్రదానం చేశారు.



## ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరును పునరుద్ధరించాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును పునరుద్ధరించాలని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణలోని మెదక్, ఏపీలోని అనంతపూర్‌లో అప్పటి ప్రధాని మన్మోహన్, యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ పర్యటించారన్నారు. ఆ సమయంలో వలసలు వెళ్లడంతో గ్రామాల్లో ఇళ్లకు తాళాలు వేసి ఉండడాన్ని వారు గమనించారన్నారు. అందులో భాగంగా పుట్టిందే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అని నగేష్ రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 100 రోజుల ఉపాధి కల్పిస్తూ వలసలను నివారించేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని ఆయన తెలియజేశారు. అలాంటి మహత్తరమైన



పథకానికి ఉన్న పేరును నేటి బీజేపీ కేంద్ర ప్రభుత్వం తొలగించడం అవివేకమన్నారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, వర్ని ఏఎంసీ ఛైర్మన్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్ బాబా, జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు యాదగిరి, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రాజా నరేందర్ గౌడ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, నగర మైనారిటీ అధ్యక్షుడు ఎజాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈసా తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ పేరును ఇందూరుగా మారుస్తాం: ఎంపీ అర్వింద్

**అక్షరటుడే, ఇందూరు :** నిజామాబాద్ పేరును ఇందూరుగా మారుస్తామని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా పేరు మార్పు డిమాండ్ ఎప్పటి నుంచో ఉందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఈసారి గెలుపు బీజేపీదేనని ఎంపీ అర్వింద్ ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో మున్సిపల్ పీఠం కొంతలో చేయి జారిందన్నారు. ఎన్నో పథకాలు కేంద్రం నుంచి వస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి చేయడం లేదన్నారు. పనిచేయని ప్రభుత్వాలకు ఓటు వేయొద్దన్నారు. గత పదేళ్లలో నగరంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని గుర్తు చేశారు. గ్రామాభివృద్ధి కోసమే జీ రాం జీ ఉపాధి హామీ పథకం మార్పు జరిగినట్టు ఎంపీ తెలియజేశారు. గ్రామ అభివృద్ధి కోసం చట్టాన్ని రూపొందించారని.. దీనిని వ్యతిరేకించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్‌కు ఇబ్బంది బీజేపీతోనా..రాముడితోనా.. లేదా కేంద్ర ప్రభుత్వంతోనా అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వంద రోజులు పని రోజులు ఉంటే 125 రోజులకు పెంచామన్నారు. ఆదివాసీలకు ఎస్టీలకు మరిన్ని రోజులు పెంచే అవకాశం ఉందన్నారు. నూతన చట్టంతో ప్రతివారం




నేరుగా వారి ఖాతాలో డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం మీద బాధ్యత ఉండేందుకు 40 శాతం నిధులు కేటాయించేలా చట్టం రూపొందించామన్నారు. పనిచేయని ప్రభుత్వాలకు ఈ చట్టం ఇబ్బందికరంగా ఉందన్నారు. వ్యవసాయ పనులకు సైతం ఉపాధి హామీ కింద పనిచేసుకోవచ్చని వివరించారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సర్కారు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందని ద్రాక్షలా మారాయి. ప్రభుత్వ దవాఖానాలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం రూ. వందల కోట్లు కేటాయిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో సేవలు మాత్రం సక్రమంగా అందడంలేదు. చిన్నపాటి రిస్క్ పేషంట్ ఆస్పత్రికి వచ్చినా మాకెందుకు ఈ తలనొప్పి అంటూ నిజామాబాద్, హైదరాబాద్‌కు రిఫర్ చేస్తున్నారు. ఫలితంగా ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్‌కు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

– అక్షరటుడే, కామారెడ్డి




# జీజీహెచ్‌లో రిఫరల్‌కే మొగ్గు

- సామాన్య ప్రజలను పట్టించుకోని వైద్యులు
- రిస్క్ కేసులను ఇతర ఆస్పత్రికి తరలిస్తున్న వైనం
- రాత్రి పూట డెలివరీకి వస్తే ఒక అంతే..
- సాకులు చూపి నిజామాబాద్, హైదరాబాద్ రిఫర్

కామారెడ్డి పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి గతంలో 100 పడకలతో ఏరియా ఆస్పత్రిగా ఉండేది. జిల్లా కేంద్రమైన తర్వాత ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిగా మారినా వసతులు లేక చాలారోజుల పాటు 100 పడకల ఆస్పత్రిగానే కొనసాగింది. ప్రస్తుతం ఆస్పత్రిలో మరొక రెండంతస్తుల నిర్మాణం చేయడంతో 330 పడకలతో కొనసాగుతోంది. అయినా ఆస్పత్రిలో అనుకున్న స్థాయిలో వైద్యం అందడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రిస్క్ కేసులన్నీ రిఫర్**

విద్యుత్ షాక్, రోడ్డు ప్రమాదాలు, విషపదార్థాలు తీసుకున్న కేసులను ఆస్పత్రిలో చేర్చుకునేందుకు నిరాకరిస్తున్నారని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. పాయిజన్, పురుగుల మందు తీసుకున్న కేసులను నిజామాబాద్‌కు రిఫర్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. రోడ్డు ప్రమాదంలో కాలు, చేయి, ఇతర భాగాలు ఏవైనా విరిగి కండిషన్ క్రిటికల్‌గా ఉంటే పట్టించుకునే పరిస్థితి లేదు. దాంతో గత్యంతరం లేక రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ రూ.లక్షలు చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

**డెలివరీ కేసులపై నిర్లక్ష్యం**

ఇక రాత్రి సమయంలో తీవ్రమైన నొప్పులతో గర్భిణులు ఆస్పత్రికి వస్తే వారిని పట్టించుకునే వారు కరువవుతున్నారు. అర్ధరాత్రి వచ్చిన గర్భిణికి ఇంకా డెలివరీకి సమయం ఉందంటూ నొప్పులు తీవ్రంగా వస్తున్నా పట్టించుకోకపోవడం తో రాత్రికిరాత్రి ప్రైవేటుకు వెళ్లి ప్రసవం చేసుకున్న ఘటనలు చాలా ఉన్నాయి. మరికొందరికి సాధారణ డెలివరీ కోసం ప్రయత్నించి ఆపరేషన్ చేయకపోవడంతో శిశువులు మృతి చెందిన ఘటనలున్నాయి.

**బిడ్డ ఎదుగుదల లేదని..**

ఇటీవల కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన గర్భిణి రాత్రి 12 గంటలకు జీజీహెచ్‌కు వచ్చింది. ఆస్పత్రిలో వైద్యులు పరీక్షించి గర్భంలో బిడ్డ ఎదుగుదల సరిగ్గా లేదు. గర్భిణికి సైతం రక్తం తక్కువగా ఉంది. ఈ కేసును తాము తీసుకోలేమని నిజామాబాద్‌కు రిఫర్ చేశారు. అక్కడికి వెళ్లాక పరీక్షిస్తే బిడ్డ ఎదుగుదల బాగుందని, గర్భిణికి కూడా ఇబ్బందులు లేకపోవడంతో మరుసటి రోజు ఆపరేషన్ చేయగా తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలా తామెందుకు రిస్క్ తీసుకోవాలన్న ఉద్దేశ్యంతో నిజామాబాద్, హైదరాబాద్ ఆస్పత్రికి రిఫర్ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

**వైద్య పరీక్షలు బయటకే..**

జనరల్ ఆస్పత్రిగా మారినా అందుకు తగినట్టుగా ఆస్పత్రిలో వైద్య పరీక్షల వసతులు లేవు. ఆస్పత్రిలో సిటీ స్కాన్, ఎండోస్కోపి, టుడీ-ఈకో, ఇతర ముఖ్యమైన పరీక్షలకు బయటకు వెళ్లాల్సిందే. ఆస్పత్రిలో ఈ పరీక్షలు చేసే సౌకర్యాలు లేకపోవడంతో వేలాది రూపాయలు వెచ్చించి బయట పరీక్షలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది

**పలుకుబడి ఉంటేనే పట్టింపు**

జీజీహెచ్‌కు నిత్యం వందలాది మంది వైద్య పరీక్షలు, ఇతరాత్ర మందుల కోసం వస్తుంటారు. ప్రతిరోజు ఓపీ వద్ద జనాలతో రద్దీగా ఉంటుంది. అయితే ఆస్పత్రిలో రోగుల పట్ల సరైన రీతిలో స్పందించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఆస్పత్రిలో అడ్మిట్ కావాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులున్నాయి. అత్యవసరం ఉన్న కేసులకు కూడా అడ్మిట్ చేసుకోవడానికి వైద్యులు ఆలోచిస్తారనే ప్రచారం సాగుతోంది.

**తీరు మారి వైద్యం అందేనా..?**

కామారెడ్డి చుట్టుపక్కల పీహెచ్, సీహెచ్‌సీ నుంచి నిత్యం వందల కేసులు జీజీహెచ్‌కు వస్తున్నాయి. అందుకు తగినట్టుగా ఆస్పత్రిలో సౌకర్యాలు లేకపోవడంతో పాటు వైద్యుల నిర్లక్ష్యం రోగుల పాలిట శాపంగా మారుతోంది. ఫలి తంగా సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## చైనామాంజా విక్రయిస్తే కఠిన చర్యలు



**అక్షరటుడే, బాన్సువాడ :** చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాఘవేందర్ తెలిపారు. నస్రుల్లాబాద్ మండలం లో చైనామాంజా విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలకు దిగారు. తన సిబ్బందితో కలిసి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లోని పలు కిరాణా షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. షాపుల్లో చైనామాంజా నిల్వలపై తనిఖీలు చేపట్టారు. ఎక్కడైనా నిషేధిత చైనా మాంజా అమ్మకం లేదా నిల్వలు ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. చైనా మాంజా వల్ల పక్షులు, జంతువులు మాత్రమే కాకుండా మనుషుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై నిషేధం విధించిందని తెలిపారు. నిషేధిత చైనా మాంజాను అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## అడవుల్లో జంతువుల లెక్కింపులో జాగ్రత్తలు పాటించాలి




**అక్షర టుడే బాన్సువాడ :** అడవులలో జంతువులను లెక్కించే క్రమంలో వలంటీర్లు జాగ్రత్తలు పాటించాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎండీ హబీబ్ సూచించారు. బాన్సువాడ పట్టణంలోని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అటవీ సంరక్షణ వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాన్సువాడ రీజియన్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, కళాశాల బోటనీ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఫారెస్ట్ విభాగం ప్రతి ఏడాది నిర్వహించే ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్పై అవగాహన కల్పించారు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని అడవుల్లో వృక్షాలు, మొక్కలు, జంతువులు, పులులను లెక్కించేటప్పుడు వలంటీర్లు పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సంతోష, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.గంగాధర్, బోటనీ విభాగాధిపతి డాక్టర్ డి.రాజేష్, రేఖ, విట్టల్, కృష్ణ, పోతురాజు శ్రీనివాస్, బాన్సువాడ డివిజన్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## యూరియా కొరతలేదు



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండలంలో యూరియా కొరత లేదని ఏవో సాయి కృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఎరువుల దుకాణాల్లో నిల్వలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటి వరకు నిర్దేశించిన లెక్కల ప్రకారం రైతులకు ఎరువుల పంపిణీ పూర్తిచేశామన్నారు. రెంజర్ల సహకార సంఘం ద్వారా 7,200 బస్తాలు, ఐడీసీఎంఎస్ ముప్కాల్ ద్వారా 3,150 బస్తాల యూరియా, ప్రైవేట్ డీలర్ల ద్వారా 2,250 బస్తాల యూరియా సరఫరా చేయడం జరిగిందన్నారు. మండలంలో ఎటువంటి యూరియా కొరత లేదని స్పష్టం చేశారు.

## ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి




**అక్షరటుడే, ఆర్మూర్ :** వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆర్మూర్ మండల న్యాయ సేవాధికార సంఘం, రోడ్డు రవాణా శాఖ, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్మూర్ కోర్టు ఆవరణ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ అంబేడ్కర్ చౌరస్తా, బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, హెల్మెట్ ధరించాలని సూచించారు. నిబంధనలు పాటిస్తూ.. ప్రమాదాలను నివారించాలన్నారు. అనంతరం బస్టాండ్‌లోని ప్రయాణికులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భవ్యశ్రీ, ఆర్మూర్ ఎంవీఐ రాహుల్ కుమార్, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, ట్రాఫిక్ ఎస్సై రఘుపతి, ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, న్యాయవాదులు, పోలీస్, ఎంవీఐ సిబ్బంది పాల్గొన్నారు.

## కామారెడ్డిలో దొంగల బీభత్సం..



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు.. ఏకంగా ఐదు దుకాణాల్లో చోరీలకు పాల్పడడం కలకలం సృష్టిస్తోంది. జిల్లాలో చోరీల కట్టడికి పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం కనిపించడంలేదు. దొంగలు తరచూ ఎక్కడో ఒకచోట చోరీలకు పాల్పడుతున్నారు. పట్టణంలో గురువారం అర్ధరాత్రి తర్వాత దుండగులు ఏకంగా ఐదు దుకాణాలలో చోరీకి పాల్పడ్డారు. పట్టణంలోని భగత్ సింగ్ నగర్‌లో జిరాక్స్ షాప్, ఆన్‌లైన్, బ్యాంగిల్ స్టోర్‌తో పాటు కొత్త బస్టాండ్ ఏరియాలోని ప్రియా డీలక్స్ రోడ్డులో రెండు మొబైల్ దుకాణాల షట్టర్లను పగులగట్టి భారీగా నగదు, వస్తువులను ఎత్తుకెళ్లారు. ఈ ఐదు దుకాణాల్లో సుమారు రూ.5 లక్షల వరకు నగదు, వివిధ వస్తువులు దుండగులు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఎప్పటిలాగే బాధిత షాపుల యజమానులు దుకాణాలకు వెళ్లగా షట్లర్లు పగులగొట్టి ఉండడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం..



**అక్షరటుడే, బాన్సువాడ :** కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుంటే, బీఆర్ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ మన్సూర్ ఆరోపించారు. బాన్సువాడలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి పై కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బీఆర్ఎస్ నాయకులకు తగదన్నారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగత విమర్శలతో రాజకీయాలు చేయడం కేటీఆర్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ తిరుమల రెడ్డి, అబ్దుల్ మొయిస్, సోషల్ మీడియా కన్వీనర్ సయ్యద్ ఇలియాస్, యువ నాయకులు సయ్యద్ గౌస్, అతిక్ పాల్గొన్నారు.



## నిజామాబాద్ పేరు మార్చాలని బీజేవైఎం నిరసన..

**అక్షరటుడే, ఇందూరు :** నిజామాబాద్ పేరును ఇందూరుగా మార్చాలని బీజేవైఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం నగరంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్నాటి కార్తీక్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు గుర్తుగా ఉన్న నిజామాబాద్ జిల్లా పేరును తొలగించి ఇందూర్ జిల్లాగా మార్చాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో 25వ డివిజన్ నాయకులు జగదీష్, నిరంజన్ చరణ్, రాకేష్, సంతోష్, యోగేష్, సాయి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం తరఫున బీజడ్‌సీ విద్యార్థులు క్షేత్ర పర్యటనకు వెళ్లారు. విజ్ఞాన సందర్శనలో భాగంగా మెదక్‌లోని ఫిషరీ డిపార్ట్‌మెంట్‌ను సందర్శించారు. అక్కడ చేపల చెరువులు, చేపవిత్తనం, చేపల పెంపకం విధానాన్ని పరిశీలించారు. తర్వాత పోచారం జింకల ప్రత్యుత్పత్తి కేంద్రంలో పర్యటించారు. జింకల సంతానోత్పత్తి ఏ విధంగా జరుగుతుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ విజ్ఞాన సందర్శనలో జంతు శాస్త్ర విభాగం అధ్యాపకురాలు జి.రాణి, అధ్యాపకుడు కిరణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ చీరల పంపిణీ

**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని పోచారంలో సర్పంచ్ కేతావత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరమ్మ చీరల పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరేలా కృషి చేయాలని, మహిళల సంక్షేమానికి ఇలాంటి పథకాలు ఎంతో ఉపయోగకరమని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ విజయ్ గౌడ్, గొప్ప, సీసీ శాదుల్, లింగామణి, రాజాగౌడ్, రుక్మవ్వ, శ్రీనివాస్, లక్ష్మి, వీఓఏ నరేష్ గౌడ్, మంజుల, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.




## సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

**అక్షరటుడే, బాల్కొండ:** మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. మండల కేంద్రానికి చెందిన తోట లక్ష్మి అనారోగ్యంతో చికిత్స పొందిన అనంతరం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.36వేల చెక్కును బాల్కొండ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో బాల్కొండ టౌన్ ప్రెసిడెంట్ సాగర్ యాదవ్, వేంపల్లి చిన్న బాల రాజేశ్వర్, ప్రసాద్ గౌడ్, ఎర్రం నరేష్ పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు





నిజామాబాద్ నగరంలోని కేవోసీ పాఠశాలలో..



బాల్కొండ మండల కేంద్రంలో..



బాన్సువాడ పట్టణంలో..




పోచంపాడ్ లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో..

ఉమ్మడి జిల్లాలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి పండుగ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలు పండుగ వాతావరణంతో కళకళలాడాయి. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు సంక్రాంతి పండుగ ప్రాముఖ్యత, సంప్రదాయాలపై విద్యార్థులకు వివరించారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్




ఆర్మూర్ స్మైల్ స్కూల్‌లో..



పతంగులతో విద్యార్థులు